క్లుప్తంగా

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్‌గా సుశీల



గ్రంథాలయ నూతన అభివృద్ధి కమిటీని అభినందిస్తున్న గ్రంథపాలకురాలు రమణ

నల్లజర్ల: స్థానిక శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్ పర్సన్‌గా జి.సుశీల ఎంపిక య్యారు. వైస్ చైర్మన్‌గా రిటైర్డ్ ఉపాధ్యాయుడు గొట్టిపాటి శ్రీరామ్మూర్తి, సభ్యులుగా కూచిపూ డి వెంకట పద్మావతి, మల్లిపూడి ఉరమయ్య, తాడి రమేష్‌లు నియమితుల య్యారు. వారిని గ్రంథపాలకురాలు ఏవీ రమణ పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందిం చారు. కార్యక్రమంలో ఆలపాటి రామకృష్ణ, చింతా చైతన్య పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్‌లు



కొవ్వూరులో అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: పేదల ఆకలి తీర్చాలనే ఆలోచన తోనే ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను ప్రారం భిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. కొవ్వూరు పట్టణంలో ఈనెల 16వ తేదీ ఉదయం ఏడు గంటలకు అన్న క్యాంటీన్‌ను ప్రారం భించనున్నట్టు బుధ వారం ఆయన తెలిపారు. కేవలం రూ.5 కే టిఫెన్, భోజనం అందిస్తారన్నారు. రిక్షా, ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, నిరుపేదల కడుపు నింపాలన్న యోచనతో రాష్ట్ర వ్యాప్తంగా 15న సీఎం చంద్రబాబు నాయుడు ఈ క్యాంటీన్‌లను ప్రారంభిస్తున్నా రన్నారు. కాగా పట్టణంలో ఏర్పాటు చేయ నున్న అన్న క్యాంటీన్‌లో ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే ముప్పిడి పరిశీలిం చారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, దాయన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సహస్ర కాంతుల కర్పూరం

- అధిక ధర పలుకుతున్న అరటి రకం
- శ్రావణమాసం, వివాహాలతో పెరిగిన వినియోగం
- రావులపాలెం అరటి మార్కెట్ యార్డు పరిధిలో మాత్రమే దిగుబడి ఉండడంతో ధర పెరుగుదల
- ఎండలు, ఈదురుగాలులు, వరదలతో సుమారు 50 శాతం అరటి చెట్లు ధ్వంసం





అరటి విక్రయాలతో కళకళలాడుతున్న రావులపాలెం అరటి మార్కెట్ యార్డు. (అంతరచిత్రం) అధిక ధర పలుకుతున్న కర్పూర రకం అరటి గెలలు

రావులపాలెం: రెండు నెలలుగా ఓ మాదిరిగా ఉన్న అరటి ధరలు 20 రోజులుగా పెరుగుతూ రైతుకు లాభాలు తెచ్చిపెడుతున్నాయి. శ్రావణ మాసం, పెళ్లిళ్ల వల్ల రాష్ట్రంలో వినియోగం పెరగడంతో పాటు, వరుసగా కృష్ణాష్టమి, వినాయక చవితి, దసరా పండగలు రావడంతో రైతుల పంట పండు తోంది. కొద్ది రోజుల పాటు ఇదే ఊపు కొనసాగే అవకాశం ఉందని రైతులు, వ్యాపారులు అంటు న్నారు. రావులపాలెం అరటి మార్కెట్ యార్డు పరి ధిలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలో రావు లపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరు, మండపేట, పి.గన్నవరం, సిద్ధాంతం మండ లాలతో పాటు, ఖండవల్లి, పెరవలి, పెనుగొండ తదితర ప్రాంతాల్లో సుమారు 12 వేల హెక్టార్లలో ఈ మార్కెట్ యార్డు పరిధిలో అరటి సాగవుతోంది. వీటిలో ప్రధానంగా ఆరు రకాల అరటి సాగవుతోం ది. సుమారు 70 శాతం కర్పూర రకం అరటి సాగు ఉంటుంది. 20 శాతం చెక్కరకేళి రకం (తెలుపు, ఎరుపు) మిగిలిన 10 శాతం బొంత, బుషావళి, అమృతపాణి రకాలు ఉంటాయి. సీజన్‌లో అంటే మార్చి నుంచి జూన్, జూలై నెలల వరకూ సగటున రోజుకు 25 వేల నుంచి 30 వేల అరటి గెలలను రైతులు రావులపాలెం అరటి మార్కెట్ యార్డుకు తీసుకువస్తుంటారు. దీంతో రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వ్యాపారం సాగుతోంది.

ఉత్పత్తి లేక..

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వ్యాప్తంగా ఎక్కడా అరటి దిగుబడి లేకపోవడం, అలాగే విశాఖ, సాలూరు, పార్వతీపురం ఇలా ఇతర జిల్లాల్లో కూడా దిగుబడి లేకపోవడంతో రావు లపాలెం అరటి మార్కెట్ యార్డులో ఇప్పుడు అమాంతం ధరలు ఎప్పుడూ లేని విధంగా రెట్టిం పు రావడంతో రైతులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మే, జూన్ నెలల్లో వచ్చిన ఈదురుగాలులకు చాలా చోట్ల అరటి చెట్లు విరిగి పోవడంతో పాటు, వరదల కారణంగా లంక ప్రాంతాల్లో అరటిపంటలు పాడవడం ఒక కారణం అయితే ప్రస్తుతం మార్కెట్‌యార్డు పరి ధిలో మాత్రమే అరటి గెలల దిగుబడి ఉండటం తో మార్కెట్‌కు రోజుకు ఏడు వేల నుంచి తొమ్మిది వేల అరటి గెలలు వస్తున్నాయి. సుమారు 6 వేల హెక్టార్లలో పంట అందుబాటులో ఉండటం, అధిక శాతం కర్పూర, చెక్కరకేళి తెలుపు రకాలు అధికంగా మార్కెట్‌కు వస్తున్నాయి. దీంతో నాసి రకం కర్పూర గెల రూ.300, మోటు గెల రూ.వెయ్యి వరకూ పలుకుతోంది. సహజంగా సీజన్‌లో రావులపాలెం మార్కెట్ యార్డు నుంచి ఒడిషా, బీహార్, జార్ఖండ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు, రాష్ట్రంలో విశాఖ, పార్వతీపురం, గుంటూరు, నంద్యాల, కర్నూలు, చిత్తూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం తమిళనాడు, ఒరిస్సా, తెలంగాణ రాష్ట్రాలకు, రాష్ట్రంలో విశాఖ, సాలూరు, పార్వతీపురం, గుంటూరు తదితర ప్రాంతాలకు ఎగుమతులు అవుతున్నాయి.

విశ్వకర్మ జయంతి నేపథ్యంలో ఒడిషా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అరటిని అధికంగా వినియోగి స్తుండటంతో ఆ రాష్ట్రాలకు అధికంగా అరటి గెలలు ఎగుమతవుతున్నాయి.

నెలన్నర వ్యవధిలో అరటి ధరల్లో వ్యత్యాసాలు ఇలా ఉన్నాయి..

అరటి రకం	జూన్ చివరి వారం		ప్రస్తుత ధరలు	
	కనిష్ఠ	గరిష్ఠ	కనిష్ఠ	గరిష్ఠ
కర్పూర	150	350	300	1000
చక్కెరకేళీ (తెలుపు)	150	350	400	700
బుషావళి	100	200	200	800
బొంత (కూర అరటి)	100	250	200	500
అమృతపాణి	100	250	350	900
చక్కెరకేళీ (ఎరుపు)	150	400	350	800

అక్టోబర్ నెల వరకూ ఆశాజనకమే




ఎక్కడా సరకు లేకపోవడంతో అరటి ధరలు బాగున్నాయి. ప్రస్తుతం మన గోదావరి జిల్లాల సరకు అందుతున్న సమయంలో ఈదురుగాలులు కొంత దెబ్బతీశాయి. దీంతో దిగుబడి తగ్గింది. ఉన్న గెలలకు ధరలు బాగా పెరిగాయి. సరకు లేకపోవడంతో అక్టోబర్ వరకూ ఇదే పరిస్థితి ఉంటుంది. అక్టోబర్ చివరి నాటికి, నవంబర్ నెలలో ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల్లో కూడా అరటి పంట మరింతగా అంది వచ్చే అవకాశం ఉంది. అప్పటిదాకా అరటి ధరకు ఇబ్బంది లేదు.

– కోనాల చంద్రశేఖరరెడ్డి, అరటి వ్యాపారి, ఊబలంక

బల్బులో భారత పతాకం

జాతీయాభిమానం చూపిన డ్రాయింగ్ మాస్టర్



బల్బులో రూపొందించిన జాతీయ జెండా



కళాఖండాన్ని తయారు చేసిన శ్రీను

రామచంద్రపురం రూరల్: చిత్రలేఖకులు సహజంగానే సృజనాత్మక శక్తితో ఉం టారు. వారి ఆలోచనలకు నిరంతరం పదును పెడు తూనే ఇంకా విభిన్నంగా ఏం చేయొచ్చనే ఆలోచనతో ఉం టారు. అలాం టి విభిన్నమైన ఆలోచనతోనే స్థానిక రామ చంద్రపురం మండలం హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో డ్రాయింగ్ టీచర్ జి.శ్రీను స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరిం చుకుని విద్యుత్ బల్బులో జాతీయ పతాక చిహ్నాన్ని రూపొందించి ఔరా అనిపించారు. ద్రాక్షారామకు చెందిన ఆయన అబ్బురాన్ని వివరిస్తూ బల్బులో ఫిలమెంట్ తీసేసి ఖాళీ చేశారు. అనంతరం సాల్ట్‌తో సగం వరకు నింపారు. అనంతరం థర్మోకూల్ ముక్కలను దానిలోకి చొప్పించారు. తరువాత జెండాలోని రంగులు ఉన్న కొవ్వొత్తులను కరిగించి అందులో కావలసిన డిజైన్ మేరకు వేశారు. తరువాత నీటి సాయంతో ఉప్పును, థర్మోకూల్ ముక్కలను తొలగించి, అనంతరం నీలం దారంతో అశోక చక్రాన్ని తయారు చేసి మధ్యలో అమర్చి ఈ కళాఖండాన్ని తయారు చేశారు. దీనిని గమనించిన సహోపాధ్యాయులు ఆయన ప్రతిభను అభినందించారు.

రైళ్ల హాల్టులు పునరుద్ధరించాలంటూ లేఖలు



రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలంటూ తాము రాసిన లేఖలను చూపుతున్న కొవ్వూరు సంస్కృత పాఠశాల విద్యార్థులు

కొవ్వూరు: కరోనా విపత్తుకు ముందు కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో ఆగే అన్ని రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని కోరుతూ రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు బుధవారం పట్టణం లోని సంస్కృత పాఠ శాల, కళాశాలల విద్యా ర్థులు మూకుమ్మడిగా ఉత్తరాలు రాశారు. రైళ్లను పునరుద్ధరించి కొవ్వూరు స్టేషన్‌ను పరిరక్షించాలని కోరారు. కొవ్వూరులో రైళ్ల హాల్టుల పునరుద్ధరణకు రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో దాతల సహ కారంతో కొంతకాలంగా ఉత్తరాల ఉద్యమం సాగు తోంది. దానిలో భాగంగా రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి ప్రతినిధులు బుధవారం ఆ విద్యాసంస్థలకు వెళ్లి విద్యార్థులతో రైల్వే శాఖ మంత్రికి ఉత్తరాలు రాయించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు వీటీ విల్సన్ రాజు, వైకే శ్రీనివాస్, పడాల సుబ్బారెడ్డి, కేవీ రమణ, కొండపల్లి రత్నసాయి, ఎన్.రమేష్, కేఎస్ రాజు, పిక్కి నాగేంద్ర, కె.గణేష్, ఈ.నాగేశ్వర రావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలి



సమిశ్రగూడెం శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచాయతీల జిల్లా రీసోర్స్‌పర్సన్ ప్రసంగరావు



సమావేశానికి హాజరైన సర్పంచులు, కార్యదర్శులు



కొవ్వూరులో శిక్షణ తరగతులకు హాజరైన ప్రజాప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ

- పంచాయతీల జిల్లా రీసోర్స్‌పర్సన్ ప్రసంగరావు
- సమావేశానికి హాజరైన సర్పంచులు, కార్యదర్శులు

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు రూరల్: ప్రతి గ్రామంలోనూ వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా పంచాయతీ పాలకవర్గాలు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీల జిల్లా రీసోర్స్‌పర్సన్ ప్రసంగరావు సూచిం చారు. మండలంలోని సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో మూడో రోజు సర్పం చులు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈనెల 14న «సాక్షి»లో «తూతూమంత్రంగా శిక్షణ» అనే శీర్షికన ప్రచురించిన కథనానికి జిల్లా పంచాయతీ అధికారులు స్పందించారు. బుధవారం నాటి శిక్షణ కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రిసోర్స్‌పర్సన్ ప్రసంగ రావు హాజరయ్యారు. ఎల్ ఈడీ లైట్ల ఏర్పాటు, పంచా యతీల ఆదాయం, అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు అం శాలపై శిక్షణ ఇచ్చారు. వివిధ పంచాయతీల సర్పం చులు, కార్యదర్శులు హాజరయ్యారు. కార్యక్రమం లో ఈఓపీఆర్డీ ఎస్.రత్నమాలిక పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

కొవ్వూరు: గ్రామాల్లో మెరుగైన పారిశుధ్య నిర్వ హణ, తడి,పొడి చెత్త వేరు చేయడం, వర్మీ కంపోస్టు తయారీ వంటి అంశాలపై పంచాయతీ కార్య దర్శులు, సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) సూచించారు. మండలంలోని సర్పంచులు, కార్యద ర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధులకు ఎంపీపీ నారాయుడు చేతుల మీదుగా బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకుముందు రీసోర్స్ పర్సన్‌లు పారిశుధ్య నిర్వహణ, తడిపొడి చెత్త వేరు చేయడం పై అవగాహన కల్పించారు.డీఎల్‌డీవో వి.శాంత మణి, ఈవోపీఆర్ అండ్ ఆర్డీ కేవీఎస్ఎస్‌యుఎం శర్మ, సర్పంచులు తానేటి కుమారి, సుంకర పద్మిని, బొలిశెట్టి రత్నకుమారి, మేకల శ్రీనివాసరావు, టి.సింహాచలం, గోశాల నాగార్జున, జెట్టి బంగారయ్య, మట్టా శ్రీనివాస్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కరప: ప్రియురాలికి వివాహం నిశ్చయమైందని తెలుసుకుని, మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మ హత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెం దాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కరప మండలం జెడ్.భావారం గ్రామానికి చెందిన వెం కటరమణ కుమారుడు పలివెల విజయ్‌కుమార్ (22) ఆటో డ్రైవర్. పెద్దాపురానికి చెందిన ఒక యువతిని ప్రేమించి వివాహం చేసుకోవాల నుకుని నిశ్చయించుకున్నారు. నాలుగు రోజుల క్రితం ఆ యువతికి పెళ్లి కుదిరిందని తెలిసింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన విజయ్‌కుమార్ ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కొవ్వాడ' ముంపునకు శాశ్వత పరిష్కారం

- రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి
- ఎమ్మెల్యే ముప్పిడితో కలసి మండలంలో పర్యటన



కొవ్వాడ కాలువ కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి తదితరులు

తాళ్లపూడి: కొవ్వాడ కాలువ వరద ముంపు శాశ్వత పరి ష్కారానికి చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి హామీ ఇచ్చారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలసి బుధవారం ఆమె తాళ్లపూడి మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి జాతీయ జెండాలు చేతబట్టుకుని రెండు గ్రామాల్లోనూ హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. తాడిపూడి మీదుగా రాగోలపల్లి, అన్నదేవరపేట గ్రామాల్లో కొవ్వాడ కాలువ వర దకు ముంపునకు గురైన పంట పొలాలను, కొవ్వాడ కాలు వపై గల కల్వర్టులను పరిశీలించారు. ఇటీవలి భారీ వర్షా లకు, కొవ్వాడ కాల్వ ముంపుతో దెబ్బతిన్న పంటలను ఎంపీ పురందేశ్వరి పరిశీలించారు. అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే ఈ పర్యటనలో 'చూస్తాం.. చేస్తాం' అనే మాటలు తప్ప ఎంపీ పురందేశ్వరి నుంచి రైతు లకు సరైన హామీ మాత్రం దక్కలేదు. కార్యక్రమంలో జన సేన పార్టీ కొవ్వూరు ఇన్‌చార్జి టీవీ రామారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, తహసీల్దార్ బి.రవీంద్రనాథ్, ఎంఈవో సీహెచ్ బాలామణి, ఈఓపీఆర్డీ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌ల పంపిణీ

ఉండ్రాజవరం: దాతల సహకారంతో మండలంలోని సూర్యారావుపాలెం ఉన్నత పాఠశాలలోని సుమారు 100 విద్యార్థులకు ఆర్టీసీ తణుకు డిపో బుధవారం ఉచిత బస్సు పాస్‌లు పంపిణీ చేసింది. రాష్ట్ర కాపు జేఏసీ నాయకుడు, జనసేన నాయకుడు వేమన శ్రీనివాసరావు, పంచాయతీ ఉప సర్పంచ్ నందిన శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో ఈ ఉచిత బస్‌పాస్‌లను విద్యార్థులకు అందజేసినట్టు ఆర్టీసీ తణుకు డిపో మేనేజర్ సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మెండే శ్రీనివాస్, తణుకు డిపో ఉద్యోగులు ములగాల వెంకటరత్నం, కిలిమి శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం జీపీ ప్రకాశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుస్తులు, దుప్పట్ల పంపిణీ



ఆశ్రమంలోని వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు అందిస్తున్న ఆనంద్ స్వరూప్

నల్లజర్ల: చీపురుగూడెం గ్రామానికి చెందిన ప్రొఫెసర్ వసంతాడ ఆనంద్ స్వరూప్ తన పుట్టిన రోజు వేడుకలను బుధవారం రాత్రి వృద్ధులు, వికలాంగుల మధ్య తన స్నేహితులతో జరుపుకు న్నారు. తొలుత జంగారెడ్డిగూడెంలోని సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సంస్థలోను, గొల్లగూడెంలోని భారతి వికలాంగుల సేవాసమితి, అనంతరం కృష్ణంపాలెంలోని అంబేడ్కర్ వృద్ధుల ఆశ్రమంలోను కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. వృద్ధులు, వికలాంగులకు దుస్తులు, దుప్పట్లు, భోజనాలు అందజేశారు.

సర్దుబాటులో దిద్దుబాట్లు!

- రేపటి వరకు అభ్యంతరాలపై గడువు
- ఈ నెల 17వ తేదీలోగా అవకాశం

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పని సర్దుబాటుపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే సర్దు బాటు సమస్య పరిష్కర చర్యల్లో ఆదిలోనే ఉపాధ్యాయ సంఘాల నుంచి పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీనిపై తిరిగి కసరత్తు ప్రారంభించారు. ఉపాధ్యాయ సం ఘాల నుంచి అనేక అభ్యంతరాలు, ప్రతిపాదనలు వచ్చిన నేపథ్యంలో పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ విజయ రామరాజు ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలతో సమా వేశం నిర్వహించారు.

కొలిక్కి వచ్చేనా..

ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను ప్రారంభిస్తూ ఈ నెల 7న విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తొమ్మిదో తేదీన జిల్లాల వారీగా మండల విద్య శాఖాధికారులు స్థానిక ఉపాధ్యాయ సంఘాల నాయకు లతో సమావేశాలు నిర్వహించారు. అయితే జీవో 117 ప్రకారం సర్దుబాటు చేపట్టడంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశాయి. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయ, విద్యార్థి (టీపీఆర్) నిష్పత్తి విషయంలో సవరణలు, సీనియారిటీని లెక్కించినపుడు ఫ్యానెల్ నెంబరు లేదా ర్యాంకును పరిగణలోకి తీసుకోవా లని, 70 శాతం పైబడి అంగవైకల్యం ఉన్నవారిని సర్దుబా ట్లలో మినహాయించాలని పలు ప్రతిపాదనలను అధికా రుల ముందు యూనియన్ నాయకులు ఉంచారు. కాని వీటిని పరిగణలోకి తీసుకోకుండా సర్దుబాట్లను చేపట్టడం తో యూనియన్ల నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిం ది. ఈ నెల 11న ఉపాధ్యాయ ఎమ్మెల్సీల సమక్షంలో విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నేతల సమా వేశాన్ని ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య (ఫ్యాప్టో) బహిష్కరిం చడంతో సర్దుబాట్ల ప్రక్రియకు తాత్కాలికంగా వాయిదా వేశారు.

16 వరకు గడువు

ఉపాధ్యాయుల పని సర్దుబాటులో భాగంగా రాష్ట్రవ్యాప్తం గా మండలాల వారీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని మిగులు, కొరత ఉపాధ్యాయుల జాబితాను అందించాలని పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ముందుగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 11 నాటికి ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది. కాని ఈ నెల 10, 11 తేదీలలో వరుసగా సెలవులు రావడం , జీవో 117పై అభ్యంతరం తెలపడంతో సర్దుబాటుకు బ్రేక్ పడింది. పాఠశాలల వారీగా ఉపాధ్యాయుల సీనియారిటీ, సెక్షన్ల వారీగా విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల కొరత తదితర వివరాలను కమిషనర్ కార్యాలయానికి చేరవే యాల్సి ఉంది. వీటితో పాటు విల్లింగ్ కోరుకునే ఉపాధ్యా యులు, సర్దుబాట్లలో భాగంగా వేరే చోటకు వెళ్లడానికి ఉన్న అభ్యంతరాలు, సీనియారిటీ జాబితాలలో ఉన్న సవరణలను సరిచేయడానికి ఈ నెల 16వ తేదీ వరకు అవ కాశం ఇచ్చారు. ఈ మేరకు గడువు ఇస్తూ పాఠశాల విద్య శాఖ హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 13న ఆర్జేడీలు, డీఈవోలు, ఎంఈవోలతో వెబెక్స్ మీటింగ్ నిర్వ హించి పలు సూచనలు చేశారు. తాజాగా అధికారులు తీసు కున్న నిర్ణయాలు ప్రకారం ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉన్నందున ఎక్కడ అవసరం ఉం టుందో అక్కడ మాత్రమే సర్దుబాటుకు చర్యలు తీసుకోనున్నారు. మండల స్థాయిలో ఎంఈవో పరిధిలోనే పని సర్దుబాటు జరగనుంది. అప్పటికీ మిగులు ఉపాధ్యా యులు ఉంటే అంతర్గత నిర్వహణలో సర్దుబాటు చేస్తారు. ఏ మేనేజ్‌మెంట్‌కు ఆ మేనేజ్‌మెంట్‌లోనే పని సర్దుబాటు చేస్తారు. మైనార్టీ భాషలకు సంబంధించి మినహాయింపు ఉంటుంది. 70 శాతం పైబడి ఉన్న దివ్యాంగులకు పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఉంటుంది. 1–8 తరగ తులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలకు కనీసం ఐదు ఎస్‌జీటీలు ఉండేలా చర్యలు తీసుకుంటారు. సీనియర్ ఉపాధ్యాయునికి విల్లింగ్ ఉంటే అతనికే అవకాశం ఇస్తారు. 2025 మే 31 లోపు పదవీ విరమణ చేసే ఉపాధ్యాయుల పాఠశాలలకు మినహాయింపు ఉంటుంది. పని సర్దుబా టులో భాగంగా వేరే పాఠశాలకు వెళ్లడానికి ఉపాధ్యాయు లకు ఉన్న అభ్యంతరాలను చెప్పుకునే అవకాశం కల్పిం చాలని సూచించారు. 17వ తేదీలోగా సర్దుబాట్లు కొలిక్కి వచ్చేలా విద్య శాఖ అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గండేపల్లి: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందినట్టు గండేపల్లి ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు. మండలంలోని నీలాద్రిరావుపేటకు చెందిన గండి కోట వీరబాబు (44) కూలీ పని నిమిత్తం యల్ల మిల్లిలో వాటర్ పైపులైన్ వేసేందుకు వెళ్లి అక్కడ బ్రేకర్ ద్వారా సీసీ రోడ్డు బ్రేక్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు బ్రేకర్‌కు కరెంట్ పాసై వీరబాబుకు విద్యుత్ షాక్ తగలడంతో అపస్మారకస్థితికి చేరుకు న్నాడు. ఇతనిని చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనం లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. మృతుని భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు తెలిపారు.

మది ఉప్పొంగేలా.. దేశభక్తి మిన్నంటేలా..



నిడదవోలు కూడలిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, అధికారులు, విద్యార్థులు

- ఊరూరా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు
- పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు
- నిడదవోలులో 50 మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ
- స్వాతంత్య్ర వేడుకలకు సిద్ధమైన కొవ్వూరు డివిజన్


కొవ్వూరులో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీ


తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది


దేవరపల్లిలో హర్ ఘర్ తిరంగా ప్రదర్శన చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

నిడదవోలు: జాతి మొత్తం ఆనందంతో ఉప్పొంగిపోయే పండుగ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు రంగం సిద్ధమైంది. ప్రతి భారతీయుడిలో దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా దాదాపు ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకం రెపరెపలాడుతోంది. నిడదవోలు పట్టణంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ స్ఫూర్తివంతంగా నిర్వహించారు. ఈ ర్యాలీని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రారంభించారు. స్థానిక గణపతి జంక్షన్ నుంచి పాటి మీద సెంటర్ వరకూ, అక్కడి నుంచి తిరిగి గణపతి జంక్షన్ వరకూ కోలాహలంగా ఈ ర్యాలీ సాగింది. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయ కార్యదర్శులు, మెప్మా సీఆర్పీలు, టీచర్లు ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే జాతీయ జెండాలను చేతబూని విద్యార్థులు ఈ భారీ ర్యాలీలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 50 మీటర్ల జాతీయ జెండాను విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది ర్యాలీలో ప్రదర్శించారు. కార్యక్రమంలో కమిషనర్ టి.రాంభూపాల్‌రెడ్డి, కౌన్సిలర్ పువ్వుల రతీదేవి, మున్సిపల్ ఏఈ సామవేదం హేమంత్, మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, పట్టణ పారిశుధ్య విభాగం పర్యవేక్షకుడు సీహెచ్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించేందుకే..

కొవ్వూరు: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి పౌరుడిలో దేశభక్తిని ఇనుమడింప జేసేందుకు చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం పట్టణంలోని మెరకవీధి వాటర్ ట్యాంకు జంక్షన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ హర్‌ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలువురు జాతీయ జెండాలు చేత పట్టుకుని పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. భారీ జాతీయ జెండా పట్టుకుని 'భారత్‌మాతాకీ జై' అంటూ విద్యార్థులు నినాదాలతో హోరెత్తించారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కమిషనర్ కె.డాని యేల్ జోసెఫ్, ఎంపీడీవో కె.సుశీల, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ , వివిధ పాఠశాలల విద్యార్థులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

తపాలశాఖ ఆధ్వర్యంలో ..

హర్‌ఘర్ తిరంగాలో భాగంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చేతుల మీదుగా కొవ్వూరు పట్టణంలో జాతీయ జెండాను ప్రదర్శించారు. గోదావరి మాత జంక్షన్ వద్ద ఎంపీ పురందేశ్వరి బుధవారం జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈనెల 15వ తేదీ వరకూ ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పోస్ట్‌మాస్టర్ జగన్‌మోహన్‌రావు, బీజేపీ నాయకులు పరిమి రాధాకృష్ణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, బీవీ ముత్యాలరావు, జనసేన నాయకుడు మారిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దేవరపల్లిలో భారీ ప్రదర్శన

దేవరపల్లి: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం దేవరపల్లిలో భారీ ఎత్తున హర్ ఘర్ తిరంగా ప్రదర్శన జరిగింది. మండల పరిషత్, మండల రెవెన్యూ, విద్యాశాఖల అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాలతో ప్రదర్శన చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకూ ఈ ప్రదర్శన సాగింది. 'వందేమాతరం', 'భారతీయ సమైక్యత వర్ధిలాలి', 'జై కిసాన్.. జై జవాన్', 'ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగరాలి' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.ప్రభాకరరావు, ఎంఈవోలు ఎం.తిరుమలదాస్, కెఆర్ఎస్‌వీ అప్పారావు, ఆర్ఐ డి.వెంకటేష్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాదే సుబ్బారావు, పీఈటీ ఓరుగంటి నాగరాజు, వీఆర్వోలు, సిబ్బంది, జెడ్పీ హైస్కూలు, భాష్యం స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: మండల ప్రజలందరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి, దేశం పట్ల తమ భక్తిని, ఐక్యతను చాటాలని తహసీల్దార్ రవీంద్రనాథ్, ఎంపీడీవో టి.వెంకటరమణ కోరారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద, పాఠశాలల్లో బుధవారం జాతీయ జెండాలు చేతబట్టి హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. తాళ్లపూడిలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ భారతి, ఏఎస్‌వో జె వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.అలాగే తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. నాయకులు, అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. పదిహేను మీటర్ల పొడవైన జాతీయ పతాకంతో అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి సచివాలయ సిబ్బంది ర్యాలీ జరిపారు. పోచవరం, రాగోలపల్లి గ్రామాల్లోనూ హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు.

అవయవదానం అపూర్వం

ప్రసాద్‌ను కొనియాడిన డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు


అవయవదాన పత్రాన్ని దాత ప్రసాద్‌కు అందజేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు

నల్లజర్ల: మనం చనిపోయాక కూడా మరికొందరికి జీవితాన్ని ప్రసాదించడం అపూర్వ కార్యక్రమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. నల్లజర్ల పీహెచ్‌సీలో పర్యవేక్షకుడిగా పని చేస్తున్న జీవీవీ ప్రసాద్ మరణానంతరం అవయవ దానానికి సంసిద్ధత వ్యక్తం చేసిన విషయం తెలుసుకున్న డీఎంహెచ్ఓ బుధవారం ఆయనను డీఎంహెచ్ఓ రాజమహేంద్రవరంలోని తమ కార్యాలయానికి ఆహ్వానించి అభినందించారు. అవయవదాన అంగీకార పత్రాన్ని ప్రసాద్‌కు ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ అందజేశారు. అవయవ దానాన్ని మరింతగా ప్రోత్సహించేలా ప్రభుత్వం సైతం అవయవదాతలకు గుర్తింపు, గౌరవం దక్కేలా పలు కార్యక్రమాలు ప్రారంభించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్లు గంగాధరరావు, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

విద్యార్థుల లక్ష్యం చదువు మాత్రమే


మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

తాళ్లపూడి: యువత చదువుపై మాత్రమే దృష్టి పెట్టాలని, సమాజాన్ని పక్కదోవ పట్టిస్తున్న మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కొవ్వూరు ఐసీడీఎస్ సీడీపీవో జి. మమ్మి పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా మంచిగా చదివి నిలబెట్టాలని సీడీపీవో ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సీహెచ్ బాలామణి, సీహెచ్ నెహ్రూజీ, కళాశాల ప్రిన్సిపాల్ గరగ శ్రీనివాస్, అధ్యాపకులు, అంగన్‌వాడీ సెక్టార్ సూపర్ వైజర్ భాగ్యకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాలు, స్నాక్స్ బాక్సులు


విద్యార్థులకు స్నాక్స్‌బాక్స్‌లు అందజేస్తున్న హెచ్‌ఎం ప్రసాదరావు

ఉండ్రాజవరం: మోర్త నంబర్-2 ప్రాథమిక పాఠశాలకు దాతలు కంచాలు, స్నాక్స్ బాక్స్‌లు సమకూర్చారు. వాటిని హెచ్‌ఎం ఎస్ఎల్‌పీ ప్రసాదరావు విద్యార్థులకు బుధవారం అందజేశారు. ఉండ్రాజవరానికి చెందిన పచ్చిపులుసు చిన సత్యం రూ.3 వేల విలువైన కంచాలు, మరో దాత రూ.1,800 విలువైన స్నాక్స్ బాక్సులు సమకూర్చారు. మోర్త సిద్ధి వినాయక యూత్ తరఫున చప్పిడి హనుమంతరావు గోడ గడియారం, దాసరి సుబ్రహ్మణ్యం మరో గోడ గడియారం స్కూల్‌కు అందజేశారు. దాతలను ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మైనం భవాని, మహిళా సమాఖ్య సభ్యురాలు భాగ్యలక్ష్మి అభినందించారు.